క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మండలంలో శనివారం సరఫరా ఉండదని విద్యుత్ శాఖ మండల ఏఈ కె.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాచర్ల: విద్యుత్ డివిజనల్ కార్యాలయ పరిధిలో రెండవ శనివారం విద్యుత్ మరమత్తుల కారణంగా మాచర్ల సబ్ డివిజన్ పరిధిలో మాచర్ల టౌన్, మాచర్ల రూరల్, వెల్దుర్తి, దుర్గి మండలాలలో, హైవే లైన్ల పనులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం ఉదయం 9 నుంచి 3 గంటల వరకు మాచర్ల పట్టణం, రూరల్ మండలం, దుర్గి, వెల్దుర్తి మండలాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్ స్టేషన్‌ల నిర్వహణ నిమిత్తం సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ఆయా మండలాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



కారెంపూడి: పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కారెంపూడిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. కారెంపూడి నాగులేరు బ్రిడ్జిపై శుక్రవారం ఎస్‌ఐ ఎం.రామాంజనేయులు పోలీసు వాహనాలను తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పై అధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అలాగే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎవరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించకూడదన్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతుంటే అలాంటి వారి సమాచారాన్ని సంబంధిత యాప్‌లో గానీ అధికారులకు గానీ సమాచారం అందించాలని ఎస్‌ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే వాతావరణం కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

ఇంటర్ ఫలితాల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



షేక్ నజ్మా



యనుమల వెంకటలక్ష్మి

దాచేపల్లి: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 68 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 92 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 72 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్ తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో షేక్ నజ్మా 447మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో యనమల వెంకటలక్ష్మి 950 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచినట్లు ఆయన వెల్లడించారు.

10 మంది వలంటీర్లు రాజీనామా



మాచర్ల రూరల్: మండలంలోని కొప్పునూరు గ్రామానికి చెందిన సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న 10 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరోజనీదేవికి రాజీనామా పత్రాన్ని అందజేశారు. పార్టీలకతీతంగా ప్రజాసేవే లక్ష్యంగా వాలంటీర్లుగా సేవలందిస్తున్న తాము వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి కోటేశ్వరరావు, పంచాయితీ సెక్రెటరీ ఐ శ్రీనివాసరావు న్నారు.

ఓటు స్వేచ్ఛగా వినియోగించుకోండి

దాచేపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. ఓటు హక్కు వినియోగంపై కేసానుపల్లి ఎస్సీ కాలనీలో ఓటర్లకు శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రలోభాలకు తలొగ్గి ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. ఓటర్లను బెదిరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, అలజడులు సృష్టించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. సదస్సులో ఎస్‌ఐ జీ. సంధ్యారాణి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే ప్రచార అస్త్రం

- నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి వివరిస్తూ ప్రచారం
- కూటమి విషప్రచారాన్ని తిప్పికొట్టడమే వైఎస్సార్ సీపీ లక్ష్యం
- నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ



ప్రచారంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి (ఫైల్)

గురజాల : నాడు నియోజకవర్గంలోని అభివృద్ధి శూన్యం. ఎక్కడి సమస్యలు అక్కడే. సమస్యలతో సతమతమవుతూ జీవనం సాగించాల్సివచ్చేంది. కేవలం టీడీపీ నాయకులు దాచుకో..దోచుకో అన్న చందాగా పాలన అందించారు. కేవలం వారి జేబులు నింపుకోవడానికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందించారు. నేడు నియోజక వర్గంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. ఎమ్మెల్యేగా కాసు మహేష్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పాలన అందిస్తూ అభివృద్ధికి దోహదపడ్డారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలనే లక్ష్యంతో పాలన అందించారు.

ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాల 10 నెలలు కావచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి పల్నాడు ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పరుగులు తీయించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజవర్గంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడిగేందుకు కార్యకర్తలు, నాయకులు వీటినే ప్రచార అస్త్రాలుగా వాడుతున్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి మంచి జరిగిందో..ఏ ప్రాంతానికి అభివృద్ధి జరిగిందోనని భావిస్తే వారే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చంద్రబాబునాయుడ , కూటమి నాయకులు చెబుతున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్‌లు ప్రచారంలో పాల్గొంటున్నారు. నియోజక వర్గంలోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి పరవళ్లు తొక్కిందని మేము చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓట్లు వేయాలని ప్రచారంలో అడుగుతున్నారు. వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందని, మరోసారి ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరిస్తారని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులే గెలిపిస్తాయి



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అభివృద్ధే ధ్యేయంగా పాలన అందించడం జరిగింది. వైఎస్సార్ సీపీ హయాంలో చేసిన అభివృద్ధే పార్టీని గెలిపిస్తుంది.అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయి. ప్రతి ఇంటికి లబ్ధి చేకూరింది. లబ్ధి చేకూరిన ప్రతి ఒక్కరూ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతారన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

– మహంకాళీ యశోద దుర్గా, గురజాల

ఊసరవెల్లి మాటలు నమ్మి మోసపోకండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్యే పీఆర్కేకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న చినగార్లపాడు మహిళలు

కారెంపూడి: కరోనా కష్ట కాలంలో సైతం ఏ సంక్షేమ పథకాన్ని ఆపకుండా మధ్య దళారులు లేకుండా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కారెంపూడి మండలంలోని చినగార్లపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పీఆర్కే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలను మించి మరింతగా లబ్ధి చేకూర్చుతారన్నారు. పొరపాటున ఊసరవెల్లి లాంటి చంద్రబాబు మాయ మాటలు విన్నారంటే అంతా అంధకారం అవుతుందన్నారు. ఇప్పటికే చినగార్లపాడు ప్రజలకు రూ.1.20 కోట్ల మేర డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందన్నారు. ప్రచారానికి ముందు గంగమ్మ గుడిలో, ఆంజనేయ స్వామి, సాయిబాబా దేవాలయాలలో పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ బుజ్జిశ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ డేవిడ్, గ్రామ పార్టీ నాయకులు అన్నపరెడ్డి పుల్లారెడ్డి, చింతలచెర్వు వాసురెడ్డి, బొమ్మిరెడ్డి నర్సిరెడ్డి, వేంపాటి నాగిరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, మేకల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కొమెర పిచ్చెయ్య వివిధ హోదాల మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. నరసరావుపేటలోని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యాలయంలో ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ షేక్ మాబు సుభాని, మైనార్టీ నాయకులు షేక్ నన్నా, సయ్యద్ మోదిన్‌బుడె, సయ్యద్ నాగులమీరా, షేక్ చికెన్ సుభాని, కొలగాని కొండలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జడ్పీటీసీ శివాయదవ్, జిల్లా కార్యదర్శి జిలుగు నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దొంటేటి ఆదిరెడ్డి, శానంపూడి శివారెడ్డి, గుర్రం గురవారెడ్డి, శానంపూడి వీరారెడ్డి, పెరుగు రోశయ్య, చింతపల్లి పెద్దసైదా పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ తిరపతమ్మ తల్లి దేవస్థానంలో పూజలు




పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పిడుగురాళ్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలంటూ పిడుగురాళ్ల పట్టణంలోని 9వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని పెనుగంచిప్రోలులో వేంచియున్న తిరుపతమ్మ దేవాలయం వద్దకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన నాయకులు హాజరైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలుపొంది భారీ మెజార్టీతో ముఖ్యమంత్రి కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా అధిక మెజార్టీతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపొందాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి 101 కొబ్బరికాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి, పేదలకు పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్ కుమార్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు దొండేటి వెంకటరెడ్డి, గాదె అనంతరామిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, సీహెచ్ సత్యనారాయణ, ఎం.శేషినాయక్, కె. రాంబాబు, ఎస్. శివనారాయణ, ఎం. కార్తీక్‌నాయక్, రాజేష్, శివారెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఉపాధి హామీ పనులను సకాలంలో పూర్తి చేయాలి

ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు



మల్లవరం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వ అభివృద్ధి పనులు

రెంటచింతల : గ్రామాల్లో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2024–2025 సంవత్సరంలో గుర్తించిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మండలంలోని మల్లవరం, పశర్లపాడు, రెంటచింతల గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని గ్రామాలలో 2024 –2025 సంబంధించి ఉపాధి హామి పథకం కింద రూ.8.50 కోట్లకు విలువైన 219 పనులకు ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతి లభించిందన్నారు. మరో రూ. 6 కోట్ల విలువైన 200 పనులను కూడా గుర్తించడం జరిగిందన్నారు. ప్రస్తుతం 2023–24 కింద గుర్తించగా మిగిలిన పనులను రెండు రోజులలో పూర్తిచేయడం జరిగిందన్నారు. 11 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు అందచేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రతకు పనులు జరుగుతున్న ప్రాంతాలలో టెంట్‌లు, మెడికల్ కిట్‌లు, మంచినీటా సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏపివో జి. జయచంద్రకుమార్, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.

ధనలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చిన కనక దుర్గ



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగులగుడి దేవస్థానంలో ఉన్న కనక దుర్గ అమ్మవారిని సుమారు రూ. 2 లక్షలతో ధనలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇంటర్ ఫలితాల్లో 61శాతం ఉత్తీర్ణత

ఎంఈఓ కాంతారావు

వెల్దుర్తి : మండలంలోని కండ్లకుంట మోడల్ స్కూల్, వెల్దుర్తి కేజీబీవీ జూనియర్ కాలేజిల్లో ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు 61 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కాంతారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కండ్లకుంట మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పరీక్షల్లో 13 మందిలో 8 మంది పాస్ కాగా ఐదుగురు ఫెయిలయ్యారు. మొదటి సంవత్సరంలో 20 మంది విద్యార్థులకు గాను 14 మంది ఉత్తీర్ణత సాధించగా 5గురు తప్పినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 10 మందిలో 6 మంది పాస్ కాగా నలుగురు ఫెయిల్ అయ్యారు. మొదటి సంవత్సరంలో 20 మంది విద్యార్థులకు గాను 14 మంది ఉత్తీర్ణత సాధించగా 5గురు తప్పినట్లు తెలిపారు. ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఈ మల్లేశ్వరి 672 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, కె శిరిష 614 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరంలో కె ప్రియ 311తో ప్రథమ స్థానం, ఎస్ గీతాంజలి 293 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. కండ్లకుంట మోడల్ స్కూల్‌లో ఇంటర్‌మీడియట్ సెకెండ్ ఇయర్ జె తిరుపతమ్మ 872 మార్కులతో ప్రథమ స్థానం నిలిచారు. జె అనిల్ కుమార్ 862 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలో జి స్వాతి 455 తో ప్రథమ స్థానం, ఎస్.అనిల్‌కుమార్ 447 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు.

నాటు సారా బట్టీని ధ్వంసం చేసిన పోలీసులు



నాటు సారా బట్టీ వద్ద ఎస్‌ఐ కోటయ్య

దుర్గి: దుర్గి మండలంలోని ఓటులేఖనిపల్లె గ్రామ సమీపంలో నాటు సారా తయారీ బట్టీని దుర్గి పోలీసులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. అక్కడ సారా తయారీకి సిద్ధంగా ఉంచిన రెండు వేల లీటర్ల బెల్లం ఊటను పోలీసులు పారబోశారు. అక్కడ తయారు చేసిన నాటు సారా సుమారు 10 లీటర్లను స్వాధీనం చేసుకుని నాటు సారా తయారీ బట్టీని పోలీసులు ధ్వంసం చేశారు. పోలీసుల రాకను గమనించి నిందితులు పరారవడంతో వారి కోసం గాలిస్తున్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందాం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్ : దేశ రాజకీయ చరిత్రలోనే ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రాజకీయ అభ్యుదయం కోసం పనిచేయడంతో పాటు ఎవరికీ సాధ్యం కాని విధంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధిని అందించిన సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకుందామని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని అచ్చమ్మకుంట గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు టీడీపిని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, సంక్షేమ ముఖ్యమంత్రిని మళ్ళీ తెచ్చుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కూటమిని ఈ ఎన్నికల్లో ప్రజలు మడతపెట్టి మూలనపెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపి నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన మేడబోయిన రామకృష్ణ, మేడబోయిన లక్ష్మయ్య, కొండయ్య, జల్లెల శ్రీనివాసరావు, జల్లెల రామాంజనేయులు, సీతాలక్ష్మయ్య, ముడిగె గోవిందు, జల్లెల వెంకయ్య, టేకులపల్లి చంద్రయ్య, జల్లెబోయిన గోవిందు, అక్కెం చిన్నోడు, ఈదయ్య, పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు, అంజయ్య, మేడబోయిన శ్రీనివాసరావు తదితరులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కోనంకి రవి యాదవ్, గన్నెబోయిన అంజయ్య పాల్గొన్నారు.



ద్వారకాపురి చెందిన టీడీపీ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



తుమ్మకోటలో సరుకుల పంపిణీ చేయిస్తున్న ఆర్‌ఐ కాంతారావు

రెంటచింతల : ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను పేదలైన లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని ఆర్ఐ దాసరి కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన తుమ్మకోట, పాలువాయి గ్రామాలలో రేషన్ లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్స్‌చే సరుకులను పంపిణీ చేయించి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను పరిశీలించి తుమ్మకోట, పాలువాయి గ్రామాలలోని ఎండీయూ ఆపరేటర్స్ నిత్యవసర సరుకును సక్రమంగా పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు మాచర్ల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మురళి స్థానిక తహసీల్దార్ ఎస్. రామ్మోహన్‌రావు దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులకు నిత్యవసర సరుకులను ఎండీయూ అపరేటర్స్‌చే పంపిణీ చేయించినట్లు తెలిపారు. నిత్యవసర సరుకులను ఎండీయూ అపరేటర్లు సకాలంలో పంపిణీ చేయాలని ఎవరైన లబ్ధిదారులకు అందచేయకపోయినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట విఆర్వోలు పల్లా రామకృష్ణ, కటికల బాలయ్య తదితరులున్నారు.

కొనసాగుతున్న రోడ్డు పునర్నిర్మాణ పనులు



ఒప్పిచర్లలో బీటీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కారెంపూడి: ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు బీటీ లేయర్ దశకు చేరుకున్నాయి. ఆ పనులు శుక్రవారం ఒప్పిచర్ల గ్రామం నుంచి ప్రారంభమయ్యాయి. గత రెండు నెలల నుంచి రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పాత రోడ్డును తొలగించి కంకర పరచి, దానిపై డస్ట్ వేసి రోలర్ తిప్పడం లాంటి పనులు ఇటీవల వరకు కొనసాగాయి. అయితే ఈ పనుల వల్ల వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము లేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అయితే శుక్రవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడంతో ఎట్టకేలకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు కాంట్రాక్టర్ ప్రారంభించారని తెలుస్తోంది. వాస్తవానికి ఒప్పందం ప్రకారం ఇప్పటికే రోడ్డు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అయితే ట్రాఫిక్ ఇబ్బందులు రోడ్డుపై అక్కడక్కడ మురుగు నీరు నిలబడి వేసిన రోడ్డు దెబ్బతినడం కారణంగా జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మాచర్ల నుంచి నరసరావుపేట వెళ్లే రహదారిలో మండలంలోని నరమాలపాడు గ్రామం నుంచి పేటసన్నెగండ్ల బ్రిడ్జి వరకు 11 కిలోమీటర్ల పొడవున రోడ్డు పునర్నిర్మాణ పనులు ఆర్ అండ్ బీ శాఖ చేపట్టింది. ప్రస్తుతం ఒప్పిచర్ల గ్రామం నుంచి బీటీ రోడ్డు వేసే పనులు ప్రారంభం కాగా పది రోజుల్లో నిర్మాణం పూర్తి అవుతుందని వారు భావిస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో స్కాలర్స్ విజయభేరి



జి. శ్రావణి,



ఆవుల పూజిత

పిడుగురాళ్ల : ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్స్ జూనియర్ కళాశాలవిద్యార్థులు ఉత్తమ ఫలితాలతో విజయభేరి మోగించారని కళాశాల డైరెక్టర్ జి. శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో జి. శ్రావణి 465 మార్కులు సాధించి పల్నాడులోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరాలో ఎంపీటీసీ విభాగంలో ఆవుల పూజిత 983 మార్కులు సాధించిందని,అత్యధిక ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయ బృందానికి కళాశాల ఛైర్మన్ జీపీరెడ్డి తోపాటు డైరెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డిలు అభినందనలు తెలిపారు.

తొండపిలో 'ఫ్యామిలీ డాక్టర్'

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 263 మందికి వైద్య సేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి తెలిపారు. 158 మందికి బీపీ, 64 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ రవిచంద్ర, మాధవిలత, సుభాన్‌బీ, రవణమ్మ, డీఈఓ రవితేజ, ఎంఎల్‌హెచ్‌పీ సుగుణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కోలగుట్లలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి ఎన్నికల ప్రచారం

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం పథకాలను వివరిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపించాలని కోరుతూ పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం మండలంలోని కోలగుట్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సాయంత్రం ఐదుగంటలకు దేవాలయంలో పూజలు నిర్వహించి అనంతరం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.